ఇందూరులో ఖేలో ఇండియా గేమ్స్ 2






అమెరికాలో ప్రమాదం.. జిల్లా వాసి మృతి 2

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatodaynews.com

26-8-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

## భీమ్‌గల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా హరీష్



**అక్షరటుడే, భీమ్‌గల:** భీమ్‌గల్ పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా కాపు కుమ్మరి హరీష్ నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు. పట్టణంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాలలకు సరఫరా అవుతున్న బియ్యంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యం చూడటానికి సన్నబియ్యం మాదిరిగానే ఉన్నప్పటికీ వండితే మాత్రం దొడ్డు బియ్యం వండినట్టుగా మారుతోంది. - అక్షరటుడే, కామారెడ్డి



# భోజనం అధ్వానం

- పాఠశాలలకు నాణ్యత లేని బియ్యం
- పురుగులు వస్తున్నా పట్టించుకోని వైనం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

జిల్లాలోని పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే బియ్యంలో అత్యధికంగా నూక కనిపిస్తోంది. అలాగే అనేక సంచుల్లో తెల్లటి పురుగులు దర్శనమిస్తున్నాయి. వాటిని సరిచేసి వంట చేయడానికి మధ్యాహ్న భోజనం వండే మహిళలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి పరిస్థితులు నెలకొంటున్నాయి.

### చూడటానికే సన్నబియ్యం

జిల్లాలోని పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న బియ్యం పరిస్థితిని పరిశీలిస్తే దారుణం కనిపిస్తోంది. బస్తాల్లో బియ్యం చూడటానికి సన్నబియ్యం మాదిరిగానే మెరుస్తోంది. కానీ వండిన తర్వాత మాత్రం పూర్తిగా దొడ్డు బియ్యం మాదిరిగా మారుతోంది. అన్నం ముద్దగా మారకున్నా చూడటానికి దొడ్డు బియ్యం వండినట్టుగా ఉంటుంది. కొన్ని పాఠశాలల్లో తినడానికి అనుకూలంగా లేకపోవడంతో విద్యార్థులు సరిగా తినకుండానే ప్లేట్లలో వదిలేస్తున్నారు. సన్నబియ్యం పేరుతో దొడ్డు బియ్యాన్ని సరఫరా చేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### నూకలు, పురుగులతో అవస్థలు


సరఫరా అవుతున్న బియ్యంలో అత్యధికంగా నూక శాతం ఉంటోంది. అంతేకాకుండా అనేక బస్తాల్లో తెల్లటి పురుగులు దర్శనమిస్తున్నాయి. దీంతో వాటిని జల్లెడ పట్టి, ఏరి శుభ్రం చేసి వంట చేయాలంటే మధ్యాహ్న భోజనం వండే మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుభ్రం చేయడానికే గంటల సమయం వృథా అవుతుండటంతో సకాలంలో విద్యార్థులకు భోజనం అందించలేకపోతున్నారు. ఈ నాణ్యత లేని బియ్యంతో వండిన అన్నం తింటే చిన్నారుల ఆరోగ్యం దెబ్బతింటుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.



### పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

ఈ విషయంపై పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించడం లేదని, ఫిర్యాదులను పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, పాఠశాలలకు సరఫరా అవుతున్న బియ్యం నాణ్యతను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన సన్నబియ్యంతో భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

### పాఠశాలల్లో తనిఖీలు చేస్తాం



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలలో మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం సరఫరా అవుతున్నాయి. అయితే ఇందులో 25 శాతం నూక వస్తుందని తెలిసింది. సన్నబియ్యం వండితే దొడ్డు అన్నం అవుతుందన్న విషయం మా నోటీసుకు రాలేదు. బియ్యంలో నూక శాతంపై తెలుసుకుంటాం. పాఠశాలలను తనిఖీ చేసి నాణ్యత లేని బియ్యం బస్తాలను మార్చి వాటి స్థానంలో క్వాలిటీ బియ్యం తెప్పిస్తాం. - మల్లికార్జున్, డీఈవో

## ఎస్ఐఆర్ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి..: ఇన్‌ఛార్జి కలెక్టర్ ప్రతిమా సింగ్



**అక్షరటుడే, కామారెడ్డి:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గురువారం సభలు నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, లోపాలు లేకుండా పూర్తి చేయడమే లక్ష్యంగా ఈ గ్రామ సభలను నిర్వహిస్తున్నామని ఇన్‌ఛార్జి కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామ సభల్లో ముసాయిదా ఓటరు జాబితాను బహిరంగంగా చదివి వినిపించడంతో పాటు జాబితాలోని వివరాలను ప్రజలకు తెలియజేస్తారన్నారు. అలాగే మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు, నివాసం మారిన ఓటర్లు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన ఓటర్లు, గైర్హాజరైన ఓటర్ల జాబితాలను కూడా చదివి వినిపిస్తారని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఓటరు తప్పనిసరిగా గ్రామ సభకు హాజరై ఓటరు జాబితాను పరిశీలించాలని, తమ పేరు, చిరునామా లేదా ఇతర వివరాల్లో తప్పులు ఉన్నా, పేరు తొలగింపుపై అభ్యంతరాలు ఉన్నా వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ గ్రామ సభల్లో బూత్ స్థాయి అధికారులు, పర్యవేక్షకులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొని నోటీసుల జారీ, విచారణ ప్రక్రియ, అభ్యంతరాల నమోదు, పరిష్కార విధానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తారని ఆమె వివరించారు.



## తెయూలో ఘనంగా తీజ్ వేడుక

**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీలో తీజ్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తీజ్ పండుగ ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు నవధాన్యాలు, గోధుమలకు నీళ్లు పోశారు. బంజారా ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్, భవానీ మాత భోగ్‌భండార్ కార్యక్రమం నిర్వహించారు. బంజారా పాటలకు నృత్యాలు చేసి అలరించారు. బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ఓనం పండుగ..



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణ కేంద్రంలోని జంబి హనుమాన్ ఆలయ ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం ఓనం పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్మూర్ అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో అభిషేకం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. నగేష్ శర్మ గురుస్వామి చేతుల మీదుగా గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, అయ్యప్ప స్వాములకు పంచామృతాభిషేకాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఓనం పండుగ వేడుకను ఘనంగా జరిపించారు. ఈ సందర్భంగా ఓనం పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు పుట్టి మురళి, కార్యదర్శి మీసాల రవి, కోశాధికారి గజారెడ్డి నర్సారెడ్డి, ముఖ్య సలహాదారులు జనార్దన్ గౌడ్, బాలాజీ గంగామోహన్, గంట విప్లవ్, ఖందేష్ శ్రీనివాస్, మీసాల రాజేశ్వర్, నందు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ హాళ్ల ఏర్పాటుకు చొరవ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం కోసం ఎమ్మెల్యే మదన్ మోహన్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. నియోజకవర్గంలోని 8 మండలాల్లో గ్రామస్థాయిలో కమ్యూనిటీ హాళ్ల అవసరం ఉందని గుర్తించి, దీనికోసం ప్రత్యేకంగా అపాయింట్ మెంట్ తీసుకుని మంత్రి అడ్లూర్ లక్ష్మణ్‌ను కలిశారు. సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రామ సభలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు కమ్యూనిటీ హాళ్లు ఎంతో అవసరమని మంత్రితో పేర్కొన్నారు. ప్రతి మండలంలో అవసరమైన గ్రామాలను గుర్తించి నిధులు మంజూరు చేయాలన్నారు. సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వినతిపై మంత్రి అడ్లూర్ లక్ష్మణ్ సానుకూలంగా స్పందించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ అవసరాలను పరిశీలించి కమ్యూనిటీ హాళ్ల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాలకు సమానంగా మౌలిక సదుపాయాలు అందేలా నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ పేర్కొన్నారు.

## పోచారం డ్యామ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నాగిరెడ్డిపేట్ మండలంలోని పోచారం డ్యామ్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పైడి ఎల్లారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్యామ్ పరిసరాలను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలన్నారు. పోచారం డ్యామ్‌కు పర్యాటక కేంద్రంగా మారే అన్ని అర్హతలు ఉన్నాయని, కానీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. పోచారం డ్యామ్‌ను పూర్తిస్థాయి పర్యాటక కేంద్రంగా మార్చడానికి ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. పర్యాటకులను ఆకర్షించేందుకు బోటింగ్ సౌకర్యం, హరిత వనాలు, పిల్లల ప్లే ఏరియా, వీక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. డ్యామ్ అభివృద్ధి చెందితే స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు.

## జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ



**అక్షరటుడే, ఆర్మూర్:** మాక్లూర్ మండలంలోని అడవి మామిడిపల్లి గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. అడవి మామిడిపల్లి సర్పంచ్ లతా సాగర్‌తో కలిసి ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. రాఖీ పండుగ సందర్భంగా వినయ్ కుమార్ రెడ్డికి రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో మాక్లూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దయాకర్ రావు, సొసైటీ ఛైర్మన్ ముల్లంగి అశోక్, చిన్నాపూర్ సర్పంచ్ చిన్న, కౌన్సిలర్లు భూపేందర్, ప్రసాద్, గంగోలి, వార్డు సభ్యులు కాంగ్రెస్ నాయకులు గంగాధర్ గౌడ్, ముల్లంగి అశోక్, దామోదర్, శివకృష్ణ, వెంకట్రావు, మోసిన్, రాకేష్ రెడ్డి చిట్టి రెడ్డి, శ్యామ్ గౌడ్, సీనియర్ నాయకులు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు అడ్లూర్ గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాల సొంతింటి కల సాకారమవుతుందన్నారు. ఈ పథకం ద్వారా ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధికి మున్సిపల్ పాలకవర్గం నిరంతరం శ్రమిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు గడ్డమీది మహేష్, అంజాద్, నిట్టు గంగాధర్, నాయకులు కాళ్ల గణేష్, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం : పీసీసీ చీఫ్



- మిగతా ఫోటోలు 2వ పేజీలో..

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మైనార్టీలనుద్దేశించి నగరంలోని నెహ్రూపార్క్ వద్ద ఆయన ప్రసంగించారు. పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, సీనియర్ నాయకుడు నరాల రత్నాకర్ మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు నగరంలో మైనారిటీలు భారీ బైక్ ర్యాలీలు తీశారు. ఈ సందర్భంగా పోలీసులు భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## భీమ్‌గల్‌లో గుంతల పూడ్చివేత



**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణంలోని కూరగాయల మార్కెట్, పాత బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో రోడ్లపై ఏర్పడిన గుంతలను మున్సిపల్ అధికారులు బుధవారం పూడ్చివేశారు. వర్షాల కారణంగా రోడ్లు దెబ్బతిని తీవ్ర గుంతలు పడటంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి, కమిషనర్ గజానంద్ ఆదేశాల మేరకు సిబ్బంది కంకర చిప్స్ వేసి చదును చేశారు. తాత్కాలికంగా గుంతలను పూడ్చి వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.



## కూలిన కంపోస్ట్ షెడ్.. పట్టించుకోని పాలకవర్గం

**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్ :** మండలంలోని అంజని గ్రామ పంచాయతీలో కూలిన కంపోస్ట్‌షెడ్ కూలిపోయినప్పటికీ పంచాయతీ పాలకవర్గం పట్టించుకోవట్లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జీపీ ఆధ్వర్యంలో ఈ షెడ్ నిర్మాణం జరిగింది. పంచాయతీ పరిధిలో తడిపొడి చెత్తను ట్రాక్టర్ ద్వారా సేకరించి కంపోస్ట్‌షెడ్‌కు తరలించి ఎరువులుగా మార్చే ఉద్దేశంతో ఈ నిర్మాణం జరిగింది. కానీ గ్రామంలో భారీ వర్షానికి గతేడాది షెడ్ కూలిపోగా దానిని ఎవరూ పట్టించుకోకపోవడంతో షెడ్ ఆవరణలో పిచ్చిమొక్కలు మొలిచాయి. కూలిపోయి ఏడాది గడుస్తున్నా జీపీ పాలకవర్గం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. వెంటనే షెడ్‌ను బాగుచేసి వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

## మేజర్ ధ్యాన్‌చంద్ ఎక్సలెన్స్ అవార్డుకు బీఆర్ నేత ఎంపిక



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** తెలంగాణ యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) బీఆర్ నేత ధ్యాన్‌చంద్ ఎక్సలెన్స్ అవార్డు 2026కు ఎంపికయ్యారు. ఈ అవార్డును ప్రతి ఏడాది జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బహూకరిస్తారు. ఈనెల 29న హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్ ఆడిటోరియంలో ఈ అవార్డును ప్రదానం చేస్తారని తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ (తెలంగాణ ఇంటలెక్చువల్స్ ఫోరం) అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఇంటెలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ప్రతిఏడాది రాష్ట్రవ్యాప్తంగా 10మంది వ్యాయామ విద్య,క్రీడల్లో సేవలందించిన వారికి ఈ ప్రతిష్టాత్మక అవార్డ్‌ను బహూకరిస్తామని ఆయన పేర్కొన్నారు.



# ఇందూరులో ఖేలో ఇండియా యూత్ గేమ్స్..

**ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026లో భాగంగా టేబుల్ టెన్నిస్ పోటీల నిర్వహణకు నిజామాబాద్ లోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో ఉన్న ఖేల్ భారతి ఇండోర్ స్టేడియం ఎంపికైంది. ఈ విషయాన్ని నవ్యభారతి గ్లోబల్ స్కూల్ సీఈవో కె. సంతోష్ కుమార్ తెలిపారు.**

**- అక్షరటుడే, నిజామాబాద్**

■ **నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో ఏర్పాట్లు..** ■ **ఖేల్ భారతి ఇండోర్ స్టేడియం సిద్ధం** ■ **తరలిరానున్న క్రీడాకారులు**

ప్రతిష్టాత్మకమైన ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తమ ఖేల్ భారతి ఇండోర్ స్టేడియం ఎంపికకావడం సంస్థకు, జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని స్కూల్ సీఈవో సంతోష్ కుమార్ తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక క్రీడా ఈవెంట్‌కు ఎంపికైన ఏకైక ప్రైవేట్ ఇండోర్ స్టేడియంగా కేల్ భారతి నిలిచిందని పేర్కొన్నారు. యువ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడంతో పాటు జాతీయ స్థాయి క్రీడాకారులకు ఆతిథ్యం ఇచ్చే స్థాయికి తమ క్రీడా మౌలిక వసతులు ఎదగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. క్రీడలను విద్యలో అంతర్భాగంగా మార్చాలన్న తమ లక్ష్యానికి ఈ గుర్తింపు నిదర్శనమని తెలిపారు. ఖేలో ఇండియా క్రీడలను విజయవంతంగా నిర్వహించేందుకు అత్యుత్తమ క్రీడా సౌకర్యాలు, క్రీడాకారులకు అవసరమైన వసతి, ఆతిథ్య ఏర్పాట్లను కల్పిస్తామని సంతోష్ కుమార్ చెప్పారు.

### ఆధునిక క్రీడా సముదాయం

ఖేల్ భారతి ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సుమారు 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించినట్లు సంతోష్ కుమార్ తెలిపారు. అన్ని కాలాల్లోనూ క్రీడా శిక్షణకు అనువుగా ఉండే ఈ సముదాయంలో బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, ఎయిర్ రైఫిల్/పిస్టల్ షూటింగ్, చెస్, క్యారమ్, ఫిట్‌నెస్, స్ట్రెంగ్త్ కండిషనింగ్ వంటి క్రీడలకు శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. అదే విధంగా సుమారు 500 మంది ప్రేక్షకులు కూర్చునే గ్యాలరీ, బాలురు, బాలికలకు ప్రత్యేకంగా వాష్‌రూమ్‌లు, చేంజింగ్ రూమ్‌లు వంటి సదుపాయాలు ఉన్నాయని వివరించారు. సర్టిఫైడ్ కోచ్‌ల ఆధ్వర్యంలో క్రమబద్ధమైన శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీపడేలా యువ క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నామని సంతోష్ కుమార్ తెలిపారు. క్రీడల నిర్వహణతో జిల్లాకు మంచి పేరు వస్తుందన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## బాధిత కుటుంబానికి పరామర్శ

**అక్షరటుడే, మెండోరా:** మెండోరాకు చెందిన నునుగొండ అంజయ్య ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని బుధవారం ప్రభుత్వ మాజీ విప్ ఈరవత్రి అనిల్ పరామర్శించారు. కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అంజయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బజరంగ్‌దళ్ ఎల్లారెడ్డి ప్రఖండ కమిటీ నియామకం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఇందూర్ విభాగ్ కార్యదర్శి తమ్మల కృష్ణ అధ్యక్షతన బజరంగ్‌దళ్ ఎల్లారెడ్డి ప్రఖండ కమిటీని బుధవారం నియమించారు. కార్యదర్శిగా అవిటి బాలరాజ్, సహ కార్యదర్శి భువనేశ్వర్, సత్సంగ్ ప్రముఖ్‌గా పంతంగి కిరణ్, సహ సత్సంగ్ ప్రముఖ్‌గా జగదీష్, సామాజిక సమరసత ప్రముఖ్‌గా పట్టెం కిషన్, బజరంగ్ దళ్ సంయోజక్‌గా సందీప్, సహ సంయోజక్‌లుగా అరుణ్, హర్షవర్ధన్, సేవా ప్రముఖ్‌గా గోపి, సహ సేవా ప్రముఖ్‌గా నాయక్, సహ గోరక్షక్ ప్రముఖ్‌గా ప్రకాష్, దుర్గావాహిని సహ సంయోజిక్‌గా శ్రీలక్ష్మి, బాల సంస్కార కేంద్ర ప్రముఖ్‌గా మహాలక్ష్మి నియమితులయ్యారు.


నిజామాబాద్ నగరంలో..


డిచ్‌పల్లిలో..


ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ..

# ఘనంగా 'మిలాద్ ఉన్ నబీ'







**ఉమ్మడిజిల్లాలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మైనార్టీలు ఆయా ప్రాంతాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్తను స్మరిస్తూ గీతాలు ఆలపించారు. ఆయన చూపిన ప్రేమ, శాంతి, మానవత్వం మనందరికీ ఆదర్శనమని ముస్లిం మతపెద్దలు పేర్కొన్నారు.**

– అక్షరటుడే, నెట్‌వర్క్

## పీఆర్టీయూటీఎస్ ఆర్మూర్ మండలాధ్యక్షుడికి సన్మానం

**అక్షరటుడే, ముప్కాల్:** ఆర్మూర్ మండల పీఆర్టీయూటీఎస్ అధ్యక్షుడిగా ఇటీవల గోపు గంగాధర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ముప్కాల్ మండల కేంద్రంలోని భూదేవ్ ఇండోర్ స్టేడియంలో ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, విద్యారంగ అభివృద్ధికి తన వంతు కృషి చేయాలన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె. గంగాధర్ రెడ్డి, సభ్యులు బద్దం నర్సారెడ్డి, బద్దం శంకర్, ప్రసాద్, షబ్బీర్, రాము తదితరులు పాల్గొన్నారు.



# గంజాయి విక్రేతతో సహా 31 మంది పట్టివేత

**అక్షరటుడే, భీమ్‌గల్/బాల్కొండ:** గంజాయి తాగుతూ, విక్రయిస్తున్న వారిపై బాల్కొండ పోలీసులు దాడులు నిర్వహించారు. బాల్కొండ వరద కాలువ గట్టు, మల్లన్న గుట్ట వద్ద బుధవారం దాడులు నిర్వహించి ఒక విక్రేతతో సహా 31 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై శైలేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. వన్నెల్ బి వరద కాలువ గట్టుపై గంజాయి తాగుతున్నారనే సమాచారంతో దాడులు చేయగా 18 మంది పట్టుబడ్డారు. వారికి గంజాయి విక్రయించేందుకు వచ్చిన వ్యక్తి వద్ద నుంచి 40 గ్రాముల ఎండు గంజాయి, జిప్‌లాక్ కవర్లు, ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మల్లన్న గుట్ట వద్ద దాడి చేసి గంజాయి తాగుతున్న మరో 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. అందరిపై కేసులు నమోదు చేశామని, విక్రేతను రిమాండ్‌కు తరలించి, గంజాయికి బానిసలైన 31 మందిని డీఅడిక్షన్ సెంటర్లకు పంపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఆర్మూర్‌లో..

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని పెర్కిట్ ఏరియాకు చెందిన నలుగురు యువకులు గంజాయి తాగుతూ పలువురికి విక్రయిస్తున్నారు. దీంతో పోలీసులు పక్కా సమాచారంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. నలుగురు వ్యక్తులు జర్నలిస్టు కాలనీకి చెందిన సమీర్ అనే వ్యక్తి నుండి గంజాయిని కొనుగోలు చేసి ఆర్మూర్‌లోని యువతకు చిన్నచిన్న ప్యాకెట్ల రూపంలో అమ్ముతున్నారు. ఈ క్రమంలో బుధవారం 11 గంటలకు నగర శివారులోని వెంచర్‌లో గంజాయిని విక్రయించేందుకు రాగా పోలీసులు పట్టుకున్నారు. వీరిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.




## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. నిజామాబాద్ వాసి మృతి



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్ :** అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నిజామాబాద్ నగరానికి చెందిన యువకుడు మృతి చెందాడు. ఫ్లోరిడాలో జరిగిన యాక్సిడెంట్‌లో తెలంగాణకు చెందిన ముగ్గురు మరణించగా.. వీరిలో నిజామాబాద్ లోని వినాయకనగర్‌కు చెందిన రాహుల్ ఉన్నాడు. ఈ యువకుడు మూడు నెలల క్రితం ఎంఎస్ చేయడానికి అమెరికాకు వెళ్లాడు. ఇంతలోనే మృత్యువు అతడిని కబళించింది. రాహుల్ మృతితో తల్లిదండ్రులు హరిబాబు, నాగమణి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** జక్రాన్‌పల్లి మండలం కలిగోట గ్రామం నుంచి వ్యాన్‌లో అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని నిజామాబాద్‌కు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. వ్యాన్‌లో సుమారు 34 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న షేక్ అబ్బాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన బియ్యం విలువ సుమారు రూ.1,69,540 ఉంటుందని ఎస్సై తెలిపారు. ఈ వ్యవహారంలో షేక్ అబ్బాస్‌తో పాటు అతనికి సహకరించిన కార్తీక్, షేక్ ఖయ్యూంపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై సందీప్ పేర్కొన్నారు.